సాక్షి
సిద్దిపేట
ఆదివారం । 8 । డిసెంబర్ । 2024



# అయ్యప్ప దీక్ష.. ఆరోగ్య రక్ష

## మాలధారణం.. నియమాల తోరణం

- ఆధ్యాత్మికం.. ఆరోగ్యదాయకం
- ప్రత్యేక పూజలతో సందడిగా మారుతున్న మణికంఠుని ఆలయాలు
- ఉమ్మడి జిల్లా అంతటా మారుమోగుతున్న స్వామి నామస్మరణ
- మండల దీక్షలు.. శబరిమలైకి పాదయాత్రలు..
- ఏటేటా పెరుగుతున్న దీక్షాపరుల సంఖ్య

8లో

సండే స్పెషల్

పల్లెలు, పట్టణాలు అయ్యప్ప నామస్మరణతో మారుమోగుతున్నాయి. మణికంఠుని ఆలయాల్లో సందడి నెలకొంది. మండల దీక్షలు, శబరిమలైకి పాదయాత్రలు కొనసాగుతున్నాయి. స్వామివారిని భక్తితో కొలిస్తే సమస్యల నుంచి గట్టెక్కిస్తాడన్నది భక్తుల నమ్మకం. అయ్యప్ప దీక్ష కఠోర నియమాలతో కూడుకున్నప్పటికీ, మానసిక, ఆధ్యాత్మిక ఆనందం లభిస్తుందని మాలధారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో అయ్యప్ప మాలధారుల సంఖ్య ఏటేటా పెరుగుతోంది.

- గన్నె తిరుపతి రెడ్డి/ రాంచెర్ల వేణుగోపాల్ రెడ్డి
దుబ్బాక/దుబ్బాకటౌన్:



జోరు వాన... జనం హైరానా



జిల్లాలో సిద్దిపేట సహా పలు ప్రాంతాల్లో శనివారం సాయంత్రం నుంచి రాత్రి 10 గంటల వరకు జోరు వాన కురిసింది. అకాల వర్షం కురవడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. కల్లాల్లోని ధాన్యం కాపాడుకునేందుకు రైతులు హైరానా పడ్డారు. కుకునూర్‌పల్లి మండలం లకుదారంలో 52.8 మిల్లీమీటర్లు, తొగుట మండలం వెంకట్రావుపేటలో 26.5 మి.మీ, మిరుదొడ్డిలో 25.0 మి.మీ, దౌల్తాబాద్‌లో 15.8, వర్గల్ మండలం గౌరారంలో 14.8 మి.మీల వర్షపాతం నమోదైంది.

-సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, సిద్దిపేట, ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)

## న్యూస్‌రీల్

### కారుణ్య నియామకాల కోసం వినతి



ఎమ్మెల్సీ యాదవరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏల వారసులు

గజ్వేల్‌రూరల్: విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ (వీఆర్‌ఏ) వ్యవస్థలో 61 ఏళ్లు పైబడిన వారి వారసుల కారుణ్య నియామకాలు చేపట్టి ఆదుకోవాలని పలువురు వీఆర్‌ఏలు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం గజ్వేల్‌లో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం వీఆర్‌ఏ వ్యవస్థను రద్దు చేసి విద్యార్హతను బట్టి వివిధ శాఖలకు కేటాయించిందని గుర్తుచేశారు. 61 ఏళ్లు పైబడిన వారసుల నియామకాలు జరపకపోవడంతో దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇంకా 3,797 మంది వీఆర్‌ఏలకు ఎలాంటి నియామక ఉత్తర్వులు ఇవ్వలేదని పేర్కొన్నారు. అందులో 265 మంది మృతి చెందారని తెలిపారు.దీక్షలో వీఆర్‌ఏల సంఘం నాయకులు నీరుడి నర్సయ్య, వెంకటయ్య, ఐలయ్య, భిక్షపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన



కలెక్టరేట్ వద్ద దీక్షలో ఉద్యోగులు

సిద్దిపేటరూరల్: తమను రెగ్యులర్ చేసి పేస్కేలు వర్తింపజేయాలని సమగ్ర శిక్షా ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద శనివారం నిరసన దీక్ష చేపట్టారు. తమను విద్యా శాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకిషన్ డిమాండ్ చేశారు. ప్రతీ ఉద్యోగికి జీవిత బీమా రూ.10 లక్షలు, ఆరోగ్య బీమా రూ.10లక్షల సౌకర్యం కల్పించాలన్నారు. పదవీ విరమణ చేస్తే రూ. 10లక్షలు ఇవ్వాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారన్నారు.

### అట్రాసిటీ కేసుల్లో 41 సీఆర్‌పీసీని వర్తింపజేయొద్దు

గజ్వేల్: అట్రాసిటీ కేసుల్లో 41 సీఆర్‌పీసీని వర్తింపజేయొద్దని జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు డీబీఎఫ్ (దళిత బహుజన ఫ్రంట్) విజ్ఞప్తి చేసింది. శనివారం న్యూఢిల్లీలో కమిషన్ చైర్మన్ అంతర్ సింగ్ ఆర్యాను వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్, జాతీయ కార్యదర్శి పి.శంకర్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీలపై దాడులు ఒకవైపు పెచ్చరిల్లుతుండగా, స్టేషన్ బెయిల్ తీసుకునే అవకాశం లభించడంతో నిందితుల ప్రవర్తనలో మార్పు ఉండటం లేదన్నారు. పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం స్ఫూర్తిని దెబ్బతీయవద్దని కోరారు.

### డ్రగ్స్‌పై ఉక్కుపాదం: సీపీ



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న విద్యార్థులు

సిద్దిపేటకమాన్: డ్రగ్స్ రహిత జిల్లా గురించి ప్రతిఒక్కరూ సహకరించాలని సిద్దిపేట సీపీ అనురాధ అన్నారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో పోలీసు కమిషనరేట్ కార్యాలయ ఆవరణలో శనివారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. జనవరి నుంచి ఇప్పటి వరకు రికవరీ చేసిన ప్రాపర్టీ కేసులు, ప్రజలకు అందించిన సేవల గురించి ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన సుమారు 1500మంది విద్యార్థులు పలు రకాల ఆయుధాలు, సీసీ కెమెరాలు, స్పీడ్ లేజర్ గన్ పనితీరు, ట్రాఫిక్ రూల్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన కిట్, డాగ్ స్క్వాడ్, సైబర్ క్రైమ్ తదితర స్టాల్స్‌ను ఏర్పాటు చేసి పోలీసు సిబ్బంది అవగాహన కల్పించారు. విద్యార్థులకు, మహిళల రక్షణ చట్టాల గురించి అవగాహన కల్పించామని సీపీ అన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల గురించి డయల్ 100, సైబర్ నేరం జరగగానే 1930 టోల్ ఫ్రీ నంబర్‌ల గురించి అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, సిద్దిపేట ఏసీపీ మధు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్, టూటౌన్ సీఐ ఉపేందర్, త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గ్యారంటీగా నిలదీస్తా..

## ప్రజల గొంతుకనై ప్రశ్నిస్తా



SAKSHI INTERVIEW సాక్షి

రాష్ట్రంతో పాటు ఉమ్మడి మెదక్ జిల్లాలో కొత్తవి ఇవ్వకపోగా పనులు సాగుతున్నవి రద్దు చేశారు. కేసీఆర్ పాలన దేశానికి దిక్సూచి అయితే రేవంత్ పాలన నవ్వుల పాలైంది. ప్రశ్నిస్తే అక్రమ కేసులు. 365 రోజులైనా ఆరు గ్యారంటీల విషయమై అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ మోసం చేస్తోంది. వెటర్నరీ కళాశాలను కొడంగల్‌కు తరలించారు అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ ప్రజాపాలన పై 'సాక్షి'తో ఆయన తన అభిప్రాయాలను వెలిబుచ్చారు. ఆ వివరాలు ఆయనమాటల్లోనే.

**కాంగ్రెస్ పాలనలో పడకేసిన ప్రగతి**

- 6 గ్యారంటీల పేరుతో అరచేతిలో వైకుంఠం..
- 365 రోజులు దాటినా అమలుకాని హామీలు
- కొత్తవి ఇవ్వకపోగా.. పాతవి రద్దు
- నిలిచిపోయిన రూ.875 కోట్ల పనులు
- సిద్దిపేట వెటర్నరీ కొడంగల్‌కు తరలింపు
- ఏడాది ప్రజాపాలనపై 'సాక్షి'తో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

సాక్షి, సిద్దిపేట

సిద్దిపేట నియోజకవర్గంలో రూ.875 కోట్ల అభివృద్ధి పనుల్లో కొన్నింటిని రద్దు చేశారు. మరి కొన్ని మధ్యలో నిలిపివేశారు. శిల్పారామం, నెక్లెస్ రోడ్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, రంగనాయకసాగర్ టూరిజం పనులు, మహతి ఆడిటోరియం, చింతమడక రెసిడెన్షియల్ స్కూల్, త్రీటౌన్ పోలీస్ స్టేషన్, మహిళా డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాల, నర్సింగ్ కళాశాల, వెయ్యి పడకల ఆస్పత్రి ఇలా చాలా పనులు మధ్యలోనే నిలిపివేశారు. చిన్నకోడూరులో ఫోర్‌లైన్ రోడ్డు పూర్తిగా రద్దు చేశారు. సిద్దిపేటకు మంజూరైన వెటర్నరీ కళాశాలను కొడంగల్‌కు తరలించారు. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్‌లకు గతంలో మంజూరైన స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్(ఎస్‌డీఎఫ్)ను వెనక్కి తీసుకున్నారు. ప్రగతి విషయంలో ఎక్కడా తగ్గబోం శాసనసభలో ప్రశ్నిస్తా. అవసరమైతే ప్రజా ఉద్యమాల ద్వారా సర్కారుపై ఒత్తిడి పెంచి పనులు సాధిస్తాం.

**అన్ని వర్గాలకు అన్యాయం**

కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజలు ఎడతెగని వంచనకు గురయ్యారు. ఇది ప్రజాపాలన కాదు ప్రజాపీడన. దేశానికి కేసీఆర్ పాలన దిక్సూచి అయితే రేవంత్ పాలన దేశం ముందు నవ్వుల పాలైంది. బడి పిల్లల నుంచి పింఛన్‌లు అందుకునే అవ్వాతాతల దాకా రోడ్డు మీదకు తెచ్చారు. ఆరు గ్యారంటీల పేరుతో అరచేతిలో వైకుంఠం చూపారు. అన్ని వర్గాలకు అన్యాయం చేశారు. బతుకమ్మ చీరెలు, బీసీ, దళిత బంధు, రైతు బంధు, గొర్రెల, చేపల పంపిణీ, కేసీఆర్ కిట్ ఇలాంటి పథకాలను ఈ ప్రభుత్వం రద్దు చేసింది.

**బోనస్ బోగస్**

వరంగల్‌లో రైతు డిక్లరేషన్‌లో 9 హామీలు ఇచ్చారు. ఇప్పటి వరకు ఒక్కటీ అమలు కాలేదు. రైతు భరోసా రూ.7,500లు ఇస్తామని ఇవ్వలేదు. ఏడాదికి మూడు పంటలకు రైతుకు భరోసా అన్నారు. ఒక్క పంటకు సైతం రైతు భరోసా లేకుండా చేశారు. అన్ని పంటలకు బోనస్ అన్నారు బోగస్ చేశారు. రుణమాఫీ సగం మందికి చేశారు.

**365 రోజులైనా**

అధికారంలోకి వచ్చి 365 రోజులైనా ఆరు గ్యారంటీలు అమలు చేయడం లేదు. నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలన్నారు. ఇప్పటివరకు ఆరు వేల ఉద్యోగాలనే భర్తీ చేశారు. ప్రభుత్వం ఇటు నిరుద్యోగులను, అటు ఉద్యోగులను మోసం చేసింది. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి లేదు. జాబ్ క్యాలెండర్ దిక్కే లేదు. ఉద్యోగులకు నాలుగు డీఏలు పెండింగ్, రిటైర్డ్ అయిన ఉద్యోగులకు బెనిఫిట్స్‌లు రావడం లేదు. ఇలా అన్ని వర్గాలను ఈ ప్రభుత్వం మోసం చేసింది.

**ప్రశ్నిస్తే కేసులు**

ఇచ్చిన అమలు చేయడం లేదని ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి పగ ప్రతీకారాలపై ఎక్కువగా దృష్టి పెడుతున్నారు. ప్రశాంతంగా ఉన్న తెలంగాణ ప్రస్తుతం అశాంతి నెలకొంది. మల్లన్నసాగర్ ముంపు బాధితుల కోసం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో డబుల్ బెడ్ రూంలు నిర్మిస్తే 4 వేల మంది నివసిస్తుంటే ఒక్క ఇల్లు కట్టలేదని సీఎం అంటున్నారు. మల్లన్నసాగర్‌లో ముంపు 14 వేలు అయితే 50 వేల ఎకరాలు అని అబద్దాలు మాట్లాడుతున్నారు. పల్లె, పట్టణ ప్రగతి నిధులు నిలిపివేశారు. దీంతో గ్రామాలు, పట్టణాలు మురికి కూపాలుగా మారాయి. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతు ఆత్మహత్యలు పెరిగాయి. ఆటో కార్మికుల ఆత్మహత్యలు జరుగుతున్నాయి.



# ఏకాగ్రతతో చదివితే ఉన్నతస్థాయికి..

**కలెక్టర్ మనుచౌదరి**

ములుగు(గజ్వేల్): విద్యార్థినులు ఏకాగ్రతతో చదువుకొని ఉన్నత స్థాయికి చేరాలని కలెక్టర్ ఎం.మను చౌదరి సూచించారు. శనివారం ములుగు మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ విద్యార్థినులతో ఫిజిక్స్ విషయాలపై కొద్ది సేపు మాట్లాడారు. సమయాన్ని వృథా చేయకుండా లక్ష్యాన్ని ఎంచుకుని చదువులో ముందుకు సాగాలన్నారు. ఒక ప్రశ్నకు సమాధానం భిన్న కోణాల్లో ఆలోచించాలన్నారు. ఏదైనా పూర్తిగా చదివితేనే అనుమానాలు నివృత్తి చేసుకోగలమన్నారు. అనంతరం పాఠశాల, కళాశాలలో 635 మంది విద్యార్థినులు చదువుతున్నారని గురుకుల ప్రిన్సిపాల్ పుష్పలత విన్నవించారు. హాస్టల్‌లో మూత్రశాలలు, ప్రహరీ, భగీరథ నీటి సరఫరా కోసం అదనంగా సంపు నిర్మాణం పనులను చేపట్టాల్సి ఉంటుందని తెలిపారు. ఈడబ్ల్యుఐడీసీ ఏఈ వచ్చి అంచనా వేస్తారన్నారు.



ములుగు(గజ్వేల్): విద్యార్థినులతో మాట్లాడుతున్న మనుచౌదరి

**కాలం చెల్లిన పదార్థాలు వాడొద్దు**

వర్గల్(గజ్వేల్): ఆహార తయారీలో కాలంచెల్లిన పదార్థాలను వాడకూడదని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. శనివారం వర్గల్ నవోదయ విద్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ప్రిన్సిపాల్ రాజేందర్‌తో విద్యాలయ ప్రాంగణం, డైనింగ్‌హాల్, కిచెన్‌షెడ్, స్టోర్‌రూం, డార్మెటరీలను పరిశీలించారు. పరిశుభ్రత బాగుందని కితాబు ఇచ్చారు. మెనూ తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థులకు రుచికరమైన వంటను అందించాలని వంట సిబ్బందిని ఆదేశించారు.

**ప్రజావాణి మంగళవారానికి వాయిదా**

సిద్దిపేటరూరల్: కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని మంగళవారం నాటికి వాయిదా వేస్తున్నట్లు కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి శనివారం తెలిపారు. డిసెంబర్ 9న వ్యవసాయ, ఉద్యాన శాఖలకు చెందిన కృషికల్ప, అగ్రి సినర్జీ 2024 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందున ఈ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు తెలిపారు.

**ఇందిరమ్మ ఇళ్ల సర్వే పారదర్శకం**

సిద్దిపేటరూరల్: ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన మొబైల్ యాప్ సర్వే పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో ఎంపీడీఓలు, ఎంపీఓలు, మున్సిపల్ కమిషనర్‌లతో కలిసి ఆయన.. ఇందిరమ్మ ఇళ్ల మొబైల్ యాప్ నిర్వహణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అర్హత కలిగిన వారికే ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ యాప్ రూపొందించిందన్నారు. ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా అన్ని గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డులలో ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్హత కలిగిన లబ్ధిదారుల వివరాలను యాప్‌లో సర్వేయర్లు నమోదు చేస్తారన్నారు. గ్రామ, వార్డుల వారీగా ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసుకుని, సర్వే ప్రక్రియను ప్రారంభించాలన్నారు. 15 రోజుల్లోపు పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి, జెడ్పీ సీఈఓ. రమేశ్, నోడల్ అధికారి శ్యాం ప్రసాద్, సీఎల్‌టీసీ స్వామి, అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో పోలింగ్ స్టేషన్‌లు 4,350

- ముసాయిదా విడుదల
- మొత్తం 6,14,371 మంది ఓటర్లు
- 12 వరకు అభ్యంతరాల స్వీకరణ

సిద్దిపేటరూరల్: రాబోయే గ్రామపంచాయతీల ఎన్నికల దృష్ట్యా జిల్లాలో 4,350 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ముసాయిదాను శనివారం కలెక్టరేట్‌లో విడుదల చేశారు. జిల్లావ్యాప్తంగా 491 గ్రామ పంచాయతీలు ఉండగా 6,14,371 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 3,02,321 మంది ఉండగా, మహిళలు 3,12,043 మంది, ఇతరులు ఏడుగురు ఉన్నారు. ఈనెల 12 వరకు అభ్యంతరాలు స్వీకరించి పరిష్కరించిన అనంతరం ఈనెల 17న తుదిజాబితా విడుదల చేయనున్నారు.

# కొమురవెల్లి ఆలయ ధర్మకర్తల ప్రమాణం



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన పాలక మండలి సభ్యులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ నూతన పాలక మండలిలోని ఎనిమిది మంది ధర్మకర్తలతో పాటు ఎక్స్‌అఫీషియో సభ్యుడు (ప్రధాన అర్చకుడు) ప్రమాణస్వీకారం చేశారు. శనివారం దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశానుసారం మెదక్ సహాయ కమిషనర్ చంద్రశేఖర్, ఆలయ ఈఓ బాలాజీ ఆధ్వర్యంలో ఆలయంలో చిగిరి కొమురయ్య, కాయిత మోహన్‌రెడ్డి, లింగంపల్లి శ్రీనివాస్, అల్లం శ్రీనివాస్, వల్లాద్రి అంజిరెడ్డి, మామిడాల లక్ష్మి, నేరెళ్లపల్లి మచ్చేందర్ రెడ్డి, కొప్పురపు జయప్రకాశ్ రెడ్డి, మహదేవుని మల్లికార్జున్‌లు ప్రమాణం చేశారు.

# ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న బీఆర్‌ఎస్

**కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ**

సిద్దిపేటరూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేద, బడుగు బలహీన వర్గాల ప్రజల ప్రభుత్వంగా మారిందని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. శనివారం నారాయణరావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ప్రజాపాలన వారోత్సవాలను నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ, ప్రజాపాలన కోఆర్డినేటర్ , పీసీసీ రాష్ట్ర నాయకులు నారాయణరెడ్డిని ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గ్రామ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో హరికృష్ణ మాట్లాడారు. హామీల అమలును చూసి ఓర్వలేక, ప్రజలకు ప్రభుత్వంపై వస్తున్న మంచి అభిప్రాయాన్ని తట్టుకోలేక బీఆర్‌ఎస్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందన్నారు.

**నియోజకవర్గ అభివృద్ధికి రూ.1200 కోట్లు**

హుస్నాబాద్‌రూరల్: నియోజకవర్గ అభివృద్ధి పనులకు గాను ఏడాదిలో రూ.1200 కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు అన్నారు. శనివారం ప్రజాపాలన విజయోత్సవ సంబరాల్లో భాగంగా కూచనపల్లిలో కేక్ కట్ చేసి విజయోత్సవాలను జరుపుకొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ నిధులు తీసుకొచ్చారని చందు తెలిపారు.

# కార్తీకం ముగిసె.. ముక్క మెరిసె

**ముద్ద దిగేదెట్లా?**

- మాంసం ధరలు పైపైకి..
- క్రిస్మస్, న్యూ ఇయర్ సందడే కారణం
- మరోవైపు జోరందుకున్న శుభకార్యాలు
- ఇప్పటికే పెరిగిన చికెన్, గుడ్ల రేట్లు



**కార్తీక మాసం ముగియడంతో మటన్, చికెన్ ధరలు ఎగబాకుతున్నాయి. మాంసాహార ప్రియులకు..ధరలు దడ పుట్టిస్తున్నాయి. శుభ కార్యాలతోపాటు క్రిస్మస్, న్యూఇయర్ వేడుకలు జరుపుకోనుండటం కూడా ధరలు పెరగడానికి కారణం అని తెలుస్తోంది. ఇప్పటికే చికెన్, కోడిగుడ్ల ధరలు మండుతున్నాయి. దీంతో మాంసాహార ప్రియులు ఖర్చు విషయంలో ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలో యేటా రూ. కోట్ల పైచిలుకు మాంస విక్రయాలు జరుగుతుండగా ఒక్క డిసెంబరు నెలలో మాత్రం రూ.30 కోట్ల వ్యాపారం జరుగుతుండటం విశేషం.**

సిద్దిపేటజోన్: జిల్లాలోని సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, చేర్యాల, హుస్నాబాద్ వంటి మున్సిపాలిటీల్లోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డులు, ఆయా మండల కేంద్రాలు, గ్రామాల్లో నిర్వహిస్తున్న దుకాణాల్లో చికెన్, చేపలు, మటన్ తదితర మాంసం అమ్మకాలు జరుపుతుంటారు. అనధికార లెక్కల ప్రకారం.. జిల్లాలో 300 చికెన్, 350 మటన్, 100 చేపల విక్రయ దుకాణాల ఉండగా వాటి ద్వారా యేటా రూ.150 కోట్ల విలువైన మాంస విక్రయాలు జరుగుతుంటాయి. యేటా సంక్రాంతి, దసరా, బక్రీద్, రంజాన్, క్రిస్మస్, న్యూ ఇయర్ సందర్భంగా పెద్ద ఎత్తున మాంస విక్రయాలు జరుగుతాయి.

**ఈనెలలోనే పెళ్లిళ్లు..**

కార్తీక మాసం తర్వాత మార్గశిర మాసం (డిసెంబర్).. ఇది శుభకార్యాలకు అనుకూలం. దీంతో పెద్దెత్తున పెళ్లి బాజాలు మోగనున్నాయి. మొదటి వారం నుంచే వివాహాలు తదితర శుభకార్యాలు మొదలు కావడం కూడా మాంస విక్రయాలపై ప్రభావం పడుతోంది. ఈ పాటికే చికెన్ ధరలు పెరుగుతున్నాయి. ఆయా ప్రాంతాలను బట్టి ధరల్లో కొంత హెచ్చు తగ్గులు ఉన్నాయి. మొన్నటి వరకు కేజీ చికెన్ రూ .180 ఉండగా ఇప్పుడు రూ. 200లకు పెరిగింది. కొన్ని ప్రాంతాల్లో ఇదే కిలో ధర రూ.220 ఉండగా మరికొన్ని చోట్ల రూ.190కి పడిపోయింది. కేజీ మటన్ ధర రూ.800 ఉండగా.. ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో కిలో రూ.850లను అమ్ముతున్నారు. మరికొన్ని ఏరియాల్లో రూ.900 వరకు విక్రయిస్తున్నట్లు పలువురు పేర్కొంటున్నారు.

**గుడ్డుకు...**

డిసెంబర్ తొలి వారంలోనే కోడిగుడ్డు ధర పెరిగింది. గత నెలలో ఒక్కో గుడ్డు ధర రూ.5 పలకగా ప్రస్తుతం రూ.7లకు ఎగబాకింది. ఈనెలలో క్రిస్మస్, న్యూ ఇయర్ వేడుకలు ఉన్నాయి. పెద్ద ఎత్తున కేకులు అమ్మకం జరిగే అవకాశాలు ఉన్నాయి. వాటి తయారీకి గుడ్డు తప్పనిసరి. దీంతో ధర రాబోయే రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉండొచ్చు. ఏదిఏమైనా గడిచిన నెల రోజులుగా కార్తీక మాసంలో ఇటు వైపు చూడని మాంసాహారులు.. ఇప్పుడు ముక్క వైపు దృష్టి సారించే క్రమంలో రేట్లు గుబులు పుట్టిస్తున్నాయి.

**ఏం కొనేటట్టు లేదు**

కోడిగుడ్డు ధర గడిచిన నెలలో ఐదు రూపాయలు. ఇప్పుడు ఏడు రూపాయలు. మున్ముందు ఈ ధర మరింత పెరిగే అవకాశం ఉంది. ఇలా అయితే గుడ్డు తినేది ఎట్లా..

-వనజ, గృహిణి

## క్లుప్తంగా

### రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఓంకార్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మద్దూరు(హుస్నాబాద్): రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు దూళ్మిట్ట మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థి ఓంకార్ ఎంపికైనట్లు పాఠశాల ఉపాధ్యాయులు శనివారం తెలిపారు. ఇటీవల మెదక్ జిల్లా మాసాయిపేటలో ఉమ్మడి జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ అండర్ 17 బాలుర సెలక్షన్‌లో ఓంకార్ ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు.

### పికెట్ బాల్ పోటీల్లో సిల్వర్ మెడల్


పతకం అందుకుంటున్న సంతోష్‌కుమార్

బెజ్జంకి(సిద్దిపేట): నర్మద కిడ్నీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముంబాయిలో నిర్వహించిన 17వ ట్రాన్స్ ప్లాంట్ జాతీయ క్రీడల్లో భాగంగా శనివారం జరిగిన పికెట్ బాల్ పోటీల్లో మండలంలోని గాగిళ్లాపూర్ గ్రామానికి చెందిన కట్కోజ్వల సంతోష్ కుమార్ సిల్వర్ మెడల్ సాధించారు. కిడ్నీ బాధితుల సంక్షేమం కోసం రాష్ట్రంలో ఏర్పాటు చేసిన చేయూత ఫౌండేషన్ ఫర్ ఆర్గాన్ ట్రాన్స్ ప్లాంట్ సంస్థ ఆధ్వర్యంలో సంతోష్ కుమార్ ఈ క్రీడల్లో పాల్గొన్నారు.

### ముసుగు దొంగ మళ్లీ వచ్చాడు


సీసీ కెమెరాలో దొంగ

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రమైన పాపన్నపేటలో మూడేళ్ల కిందట హల్‌చల్ చేసిన ముసుగు దొంగ మళ్లీ వచ్చాడు. నాలుగు రోజులుగా పాపన్నపేట బస్‌స్టాండ్ ప్రాంతంలో తిరుగుతున్నాడు. స్వెటర్, మంకీ క్యాప్, గ్లౌజ్‌లు ధరించి రాత్రి వేళల్లో వచ్చే ఆ గుర్తు తెలియని దొంగ, ఇళ్ల ఎదుట ఉన్న కరెంట్ కనెక్షన్లు, సీసీ కెమెరా కనెక్షన్లు కట్ చేయడం, ఇళ్లకు గొళ్లెం పెడుతూ జనాలను భయభ్రాంతులను చేస్తున్నాడు. అతడి చర్యలన్నీ సీసీ కెమెరాల్లో నిక్షిప్తమై ఉన్నాయి. పోలీసులు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని బాధితులు వాపోతున్నారు.

# అయ్యప్ప దీక్ష.. ఆరోగ్య రక్ష

## అయ్యప్ప నామస్మరణతో మారుమోగుతున్న పట్టణాలు, పల్లెలు


అయ్యప్ప పడి పూజ చేస్తున్న స్వాములు

జిల్లాలో మాలాధారణ వేసిన స్వాములు అత్యంత ప్రీతిపాత్రంగా పడి పూజలను నిర్వహిస్తారు. అయ్యప్ప సన్నిధానంలో 18 మెట్లు ఉంటాయి. ఇవి కామం, క్రోధం, లోభ, మోహ, మద, మత్సర్యాలైయిన అరిషడ్వర్గాలని ప్రతీతి. మనిషిలోని 18 రకాల చెడు గుణాలు తొలగిపోవడానికి దీక్షలో పడిపూజ (మెట్టు పూజ) నిర్వహిస్తారు. అయ్యప్ప మాల ధరించిన ప్రతీసారి చెడు లక్షణాలను విడిచిపెట్టి మంచి వారీగా మారాలని కోరుకుంటూ ఈ పూజను నిర్వహిస్తారని గురుస్వాములు చెబుతున్నారు.

దుబ్బాక/దుబ్బాకటౌన్:

### అకుంఠిత దీక్ష

అంతులేని ఆత్మవిశ్వాసం, అంతకుమించి సన్నిధానానికి చేరుకొని స్వామిని దర్శించడమే అయ్యప్ప దీక్షలోని ఆంతర్యం. ఈ దీక్ష అద్వితీయమైన నియమాలతో రూపొందించింది. అయ్యప్ప దీక్షను పాటించే సమయమిదే. 41 రోజుల పాటు కఠోర నియమాలు పాటిస్తూ, నిష్ఠగా పూజాది కార్యక్రమాలు ఆచరించే భక్తులకు పవిత్రమైన రోజులివి. తనువు, మనస్సును చెడు నుంచి మంచి మార్గం వైపు మళ్లించే ఈ దీక్షను స్వీకరించిన భక్తులు స్వామియే శరణం అంటూ అయ్యప్ప సేవలో తరిస్తుంటారు.

### మాలాధారులు వివిధ రకాలు

అయ్యప్ప మాలను కొత్తగా ఈ సంవత్సరమే ధరించినవారు ఉంటారు. ఏళ్ల తరబడిగా దీక్ష స్వీకరిస్తున్నవారు ఉంటారు. అయితే ఎవరిని ఎలా పిలుస్తారో చాలా మందికి తెలియదు. మొదటిసారి మాలధరిస్తే 'కన్నె స్వామి' అంటారు. రెండోసారి ధరించిన భక్తులను 'కత్తి స్వామి'గా పిలుస్తారు. మూడోసారి అయితే 'గంట స్వామి', నాలుగోసారి 'గధ స్వామి', ఐదోసారి 'పేరు స్వామి', ఆరోసారి ధరించిన వారిని 'త్రిశూల్ స్వామి' అని వ్యవహరిస్తారు. ఏడు, అంతకన్న ఎక్కువసార్లు ధరిస్తే 'గురు స్వామి'గా పరిగణిస్తారు. 18, అంతకన్నా ఎక్కువ సార్లు మాల ధరించినవారిని 'నారికేళ స్వామి' అని సంబోధిస్తారు.

### ఇరుముడి అత్యంత ప్రాధాన్యం

అయ్యప్పస్వామిని నవ విధ సేవలతో పూజిస్తుంటారు. నవ విధాలుగా అనగా శ్రావణం, కీర్తనం, స్మరణం, పాదాసేవనం, అర్చనం, నమస్కారం, ధాన్యం, ఆత్మ నివేదనంతో 41 రోజులు దీక్ష పూర్తి చేసిన తర్వాత ఇరుముడికి అత్యంత ప్రాధాన్యం ఉంటుంది. ఇరుముడి అంటే రెండు ముడులు అని. ముందు ముడి (మొదటి మూట)లో పీఠం, భస్మం, గంధం, కొబ్బరికాయలు, నెయ్యి, పూజా సామగ్రి ఉంటాయి. వెనుకముడి (రెండో మూట)లో ప్రయాణానికి కావాల్సిన వస్తువులుంటాయి. వీటినే పుణ్యపు మూట, పాపపు మూట అని పిలుస్తారు.

### శబరిమలైకి 41 రోజుల పాదయాత్రతో..

అయ్యప్పమాల ధరించిన స్వాములు ప్రతియేటా జిల్లా నుంచి శబరిమలైకి అయ్యప్పస్వామి దర్శనాకి ఇరుముడి కట్టుకొని పాదయాత్రగా వెళ్తున్నారు. మొత్తం 41 రోజులపాటు 5 రాష్ట్రాల గుండా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో 1,400 కిలోమీటర్లు పాదయాత్రతో వెళ్లి స్వామి దర్శనం చేసుకోవడం విశేషం. ఈ సంవత్సరం మొత్తం 140 మంది స్వాములు సిద్దిపేట జిల్లాకు చెందిన 13 మంది స్వాములతోపాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన స్వాములు అక్టోబర్ 20న ప్రారంభమై నవంబర్ 29 న పాదయాత్రగా వెళ్లి అయ్యప్ప స్వామిని దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు.

### కన్నెస్వాములు ఎంతో ప్రత్యేకం..

జిల్లాలో కన్నె స్వాములు అయ్యప్ప మాలాధారణ చేస్తున్నారు. మాలాధారణలో కన్నె స్వాముల మాలాధారణ ఎంతో ప్రత్యేకం. కన్నె స్వాముల మాలాధారణకు విశేష చరిత్ర ఉంది. శబరి కొండల్లో ఉండే మాలికా పురోత్తమ అయ్యప్పస్వామిని ప్రేమిస్తుంది. తనను వివాహం చేసుకోవాల్సిందిగా కోరుతుంది. ఇది విన్న స్వామివారు చిరునవ్వుతో తిరస్కరిస్తాడు. అయినా ఆమె పట్టువీడదు. దీంతో కన్నెస్వాములు తన మాల ధరించి రానప్పుడు వివాహమాడుతానని స్వామి ఆమెకు మాట ఇచ్చాడు. నూతన మాలధారులైన కన్నెస్వాములు రాకుండా ఉండడం ఎప్పటికీ జరగదని దీనిలో పరమార్థం. ఇందులో భాగంగానే ఏటేటా కన్నెస్వాముల సంఖ్య పెరుగుతూనే వస్తుంది.

### తండ్రీకూతురు మాలాధారణ..



దుబ్బాక మున్సిపాలిటీలోని ధర్మాజీపేటకు చెందిన దివిటి సత్తయ్యతోపాటు ఆయన కూతురు మణి దీపిక(10 ఏళ్లు) అయ్యప్పమాల వేశారు. తండ్రి సత్తయ్య 11 ఏళ్లుగా మాల వేస్తుండగా ఈ సారి మణిదీపిక మొదటిసారి దీక్ష బూని తండ్రితోపాటు అత్యంత కఠినమైన నియమావళిని పాటిస్తుంది. ఈ కన్నెస్వామిని భక్తిని చూసి ప్రతి ఒక్కరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– దివిటి మణి దీపిక, కన్నె స్వామి


శబరిమలైకి పాదయాత్రగా వెళ్తున్న స్వాములు

### అయ్యప్ప దీక్ష నియమాలు..

- అయ్యప్ప దీక్ష తీసుకున్న భక్తులు నల్లని దుస్తులు ధరించాలి. 41 రోజుల పాటు (మండలం రోజు) నియమ నిష్ఠలు పాటించాలి.
- దీక్షా సమయంలో తల, గడ్డం, వెంట్రుకలు, గోళ్లను తీయడం నిషేధం. చెప్పులు ధరించొద్దు.
- తెల్లవారుజామున అమృత ఘడియల్లో (సూర్యోదయానికి ముందు) చల్లని నీటితో స్నానం ఆచరించాలి. సాయంత్రం కూడా చల్లని నీటితో స్నానం ఆచరించాలి.
- నుదుట విబూది, గంధం, కుంకుమ మధ్యలో బొట్టు పెట్టుకోవాలి.
- ఒక్కపూట భోజనం (మధ్యాహ్నం భిక్ష) రాత్రి పండ్లు, ఫలహారం అల్పాహారంగా తీసుకోవాలి. కటిక నేలపై నిద్రించాలి.
- అశుభ కార్యాలు జరిగే ప్రదేశాలకు, దుఃఖ: సంబంధమైన ఘటనల్లో పరామర్శకు వెళ్లరాదు. పగలు నిద్రించకూడదు. శవాన్ని చూడకూడదు. మనస్సును అదుపులో ఉంచుకొని శరణుఘోష చెప్పుకోవాలి.
- పూజ చేసుకున్న తర్వాత ఉదయం, సాయంత్రం వృత్తి రీత్యా పనులు చేసుకోవచ్చు.
- తన శక్తి కొలది ఒక్కసారైనా ఐదుగురు అయ్యప్పలకు భిక్ష పెట్టాలి. హింసాత్మక చర్యలు, దుర్భాషలాడడం, అబద్ధాలాడడం చేయరాదు. దీక్షా సమయంలో హోదా, వయస్సు, పేద, ధనిక తేడా లేకుండా అయ్యప్పలందరికీ పాదాభివందనం చేయాలి.

### మూడేళ్లుగా పాదయాత్ర చేస్తున్న..



18 సార్లు అయ్యప్ప మాలాధారణ స్వీకరించిన. గురుస్వామిగా వరుసగా మూడేళ్లుగా శబరిమలైకి పాదయాత్రగా వెళ్తున్నాను. ఈయేడు కూడా తనతోపాటు మరో 12 మంది అయ్యప్పస్వాములతో కలిసి శబరిమలైకి నెత్తిన ఇరుముడి కట్టుకొని పాదయాత్రగా వెళ్లాను. 41 రోజులపాటు పాదయాత్రగా శబరిమలై చేరుకొని అయ్యప్పస్వామిని దర్శనం చేసుకొని రెండు రోజుల కిందటే సిద్దిపేటకు చేరుకున్నాం. ప్రతీయేటా మాలాధారణ చేయడమే కాకుండా భక్తి శ్రద్ధలతో అయ్యప్పధరికి పాతయాత్రగా వెళ్తున్నాను.

– సంగం మధుసూధన్‌రెడ్డి, గురుస్వామి

### 31 ఏళ్లుగా మాలవేస్తున్న



నేను 31 ఏళ్లుగా అయ్యప్ప మాలధారణ వేస్తున్నా. ఈ అయ్యప్ప దీక్షతో ఆధ్యాత్మిక చింతనతోపాటు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది. చన్నీళ్ల స్నానం, ఒక్క పూట భోజనం, దేవతారాధన వంటి అలవాట్లు మనిషి జీవితంపై చక్కటి ప్రభావాన్ని చూపుతాయి. ప్రతీయేటా అయ్యప్పమాల ధారణ స్వాములు పెరుగుతూ వస్తున్నారు.

– వెనిశెట్టి సుభాష్, గురుస్వామి

### మొదటిసారి మాల వేసిన



మొదటిసారి అయ్యప్పమాలాధారణ వేసిన. గురు స్వాములతో కలిసి 41 రోజుల శబరిమలైకి పాదయాత్రతో వెళ్లి అయ్యప్పస్వామిని దర్శనం చేసుకోవడం నా జీవితం ధన్యమైంది. నాకు బీపీ, షుగర్ ఉన్నా 41 రోజుల పాటు గురుస్వాముల ఆధ్వర్యంలో 5 రాష్ట్రాల గుండా 1,400 కిలోమీటర్లు నడిచి స్వామి సన్నిధికి చేరుకోవడం నా జీవితంలో మరువలేని అనుభూతి.

– అరుట్ల యాదవరెడ్డి,నగరం



# విద్యుదాఘాతంతో రైతు మృతి


రాంరెడ్డి(ఫైల్)

న్యాల్‌కల్(జహీరాబాద్): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని చినిగెపల్లి గ్రామంలో చోటు చేసుకొంది. హద్నూర్ ఎస్‌ఐ చల్లా రాజశేఖర్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన రైతు చాల రాంరెడ్డి(49) ఎకరన్నర పొలంలో ఉల్లి పంటలను సాగు చేసుకున్నాడు. శనివారం ఉదయం పంటకు నీరు పెట్టేందుకు పొలానికి వెళ్లాడు. విద్యుత్ మోటార్‌ను ఆన్‌చేయగా స్టార్ట్ కాలేదు. పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరకు వెళ్లి బంద్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని గమనించిన మెరియంపూర్ గ్రామానికి చెందిన రైతు రాంరెడ్డి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

### నీటిగుంతలో పడి మరో రైతు..


మోహన్ మృతదేహం

చిన్నశంకరంపేట(మెదక్): ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి రైతు మృతి చెందాడు. చిన్నశంకరంపేట ఎస్‌ఐ నారాయణగౌడ్ కథనం మేరకు.. ఎస్.కొండాపూర్ గెరిల్లాతండాకు చెందిన నూనవత్ మోహన్(45) ఉదయం పనుల కోసం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ నీటి నిల్వ కోసం తవ్విన గుంతలో ప్రమాదవశాత్తు పడి మునిగిపోయాడు. చుట్టు పక్కల రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మోహన్‌ను గుంతలోనుంచి బయకు తీయగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు పోలీస్‌లు కేసు నమోదు చేశారు.

### చెరువులో పడి వ్యక్తి..


బాలరాజు మృతదేహం

తూప్రాన్: చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం కథనం మేరకు.. పట్టణానికి చెందిన సాటుకురి బాలరాజు(46) శనివారం ఉదయం వాకింగ్ కోసం బైక్‌పై పట్టణ సమీపంలోని చెరువు కట్టపైకి వెళ్లాడు. మధ్యాహ్నం వరకు ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు అనుమానంతో చెరువు కట్టపైకి వెళ్లి చూడగా బైక్ కనిపించింది. అనుమానంతో చెరువులో గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. బాలరాజు మృతిపై ఎలాంటి అనుమానం లేదని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### అనుమానాస్పదస్థితిలో మెకానిక్..


ప్రభాకర్ (ఫైల్)

బెజ్జంకి(సిద్దిపేట): అనుమానాస్పదంగా మెకానిక్ మృతి చెందాడు. ఎస్‌ఐ క్రిష్టారెడ్డి కథనం మేరకు.. రాజన్న సిరిసిల్లా జిల్లా ఇల్లంతకుంట మండలంలోని రేపాక గ్రామానికి చెందిన వెగ్గలం ప్రభాకర్ (55) భార్య రమాదేవితో కలిసి బెజ్జంకిలో ఉంటూ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. రమాదేవి మూడు రోజుల కిందట వివాహాది శుభకార్యాల కోసం వేరే గ్రామానికి వెళ్లగా ప్రభాకర్ ఇంట్లో ఒక్కడే ఉన్నాడు. శనివారం వచ్చిన రమాదేవి ఇంట్లో చూడగా మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారమివ్వగా ఘటనా స్థలాన్ని పరిశీలించి పంచనామా కోసం మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రమాదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

### ఏడుపాయల్లో మతి స్థిమితం లేని మహిళ..


నాగమ్మ మృతదేహం

పాపన్నపేట(మెదక్): మతి స్థిమితం లేని మహిళ మృతి చెందిన ఘటన ఏడుపాయల్లో శుక్రవారం చోటు చేసుకుంది. పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్.. వెల్దుర్తి మండలం మంగళపర్తి గ్రామానికి చెందిన పలరం నాగమ్మ (40) భర్త శంకర్ తో కలిసి కొంత కాలం కిందట బతుకు దెరువు కోసం రంగారెడ్డి జిల్లా బాలానగర్ శ్రీశ్రీనగర్ వెళ్లారు. కొద్దిరోజులుగా నాగమ్మ మతిస్థిమితం కోల్పోయి ఫిట్స్ వ్యాధితో బాధపడుతోంది. నాలుగు రోజుల కిందట ఇంటి నుంచి తప్పిపోయి ఏడుపాయలకు వచ్చి ఇక్కడే ఉంటుంది. శుక్రవారం సాయంత్రం ఏడుపాయల ఘనపూర్ ప్రాజెక్ట్ మెట్లపై ఉండగా, ఫిట్స్ వచ్చి పడిపోయి మృతి చెందినట్లు ఎస్సై వివరించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

## దుకాణంలో అగ్ని ప్రమాదం


దగ్ధమైన సామగ్రి

పాపన్నపేట(మెదక్): మండలంలోని నార్సింగిలో శుక్రవారం రాత్రి ఒక దుకాణంలో అగ్ని ప్రమాదంలో చోటు చేసుకుంది.పాపన్నపేటకు చెందిన కటికె ఆబిద్ నార్సింగిలో వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు. శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించగా, ఇంట్లో ఉన్న వ్యాపార సామగ్రి, నగదు, వెండి, బంగారం, దుస్తులు, నిత్యావసర వస్తువులు పూర్తిగా దగ్ధమైనట్లు తెలిపారు. దీంతో రూ.4 లక్షల ఆస్తినష్టం జరిగినట్లు బాధితులు వాపోయారు.

## లారీని ఢీకొట్టిన కారు

### నలుగురికి గాయాలు

అల్లాదుర్గం(మెదక్): లారీని కారు ఢీకొట్టడంతో నలుగురికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన శనివారం అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని చిల్వెర ఐబీ చౌరస్తాలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి కథనం మేరకు.. నిజామాబాద్ జిల్లా వర్ని గ్రామం నుంచి దేవిదాస్ కుటుంబ సభ్యులు కారులో హైద్రాబాద్‌కు వెళ్తున్నారు. 161 జాతీయ రహదారిలో ఐబీ చౌరస్తా వద్దకు రాగానే ముందు వెళ్తున్న లారీని కారు అతివేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారుల ప్రయాణిస్తున్న పీర్యానాయక్ , బూలిబాయ్, మారుబాయ్, దీనేశ్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రుడు పీర్యానాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## సిద్దిపేటపై కక్ష ఎందుకు?

### ఎమ్మెల్యే హరీశ్ రావు

సిద్దిపేటజోన్: కాంగ్రెస్ ప్రస్తుతం అధికార హోదాలో పనులను, నిధులను రద్దు చేస్తుందని, సిద్దిపేట ప్రజల మీద కాంగ్రెస్ పార్టీకి కక్ష ఎందుకని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రశ్నించారు. శనివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రామకృష్ణ అనుచరులతో కలిసి హరీశ్ రావు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు సిద్దిపేట ఆర్ఎంపీ, పీఎంపీ డాక్టర్ల నూతన కమిటీ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని హరీశ్ రావు అభినందించారు. కార్యక్రమంలో సిద్దిపేట పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సంపత్ రెడ్డి, కౌన్సిలర్లు విఠోభ, వరాల సురేశ్, శ్రీనివాస్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# విజ్ఞానజ్యోతి విద్యార్థుల స్టడీటూర్

### టమాటా సాగు వివరాలపై ఆరా

కౌడిపల్లి(నర్సాపూర్): హైదరాబాద్ బాచుపల్లిలోని విజ్ఞానజ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఎంబీఏ విద్యార్థులు గ్రామాలకు స్టడీ టూర్‌కు వచ్చి గ్రామ వివరాలు, పంటల సాగు గురించి అడిగి తెలుసుకున్నారు. శనివారం ఎంబీఏ ఫ్యాకల్టీ డాక్టర్ వినిత్, డాక్టర్ విశాల్, డాక్టర్ శీలాం, డాక్టర్ హమద్ హుస్సేన్ ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం మండలంలోని తునికి విజ్ఞానజ్యోతి వ్యవసాయ కళాశాలను సందర్శించారు. అక్కడి నుంచి కొడిపల్లి, వెంకట్రావ్‌పేట గ్రామాల్లో పర్యటించారు. గ్రామాల్లో ప్రభుత్వ పథకాలు, కనీస అవసరాలు, సౌకర్యాలు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దీంతోపాటు కొడిపల్లిలోని టమాట రైతు మహిపాల్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రం సందర్శించి టమాట, క్యాప్సికం, వరి తుకం పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు మహిపాల్‌రెడ్డి పంటల సాగులో ఆధునిక పద్ధతులు, కూలీల వినియోగం, ఎరువుల వినియోగం, చీడపీడల నివారణ, సస్యరక్షణ చర్యలు, దిగుబడి, మార్కెటింగ్, లాభ నష్టాలను గురించి విద్యార్థులకు వివరించారు. కోర్సులో భాగంగా స్టడీటూర్‌లో వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక విజ్ఞానజ్యోతి ఫీల్డ్ మేనేజర్ జగదీశ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


టమాటా సాగును వివరిస్తున్న రైతు

# ఆహారంలో నాణ్యత లోపిస్తే ఉపేక్షించం

- ఫుడ్ పాయిజన్ ఘటనలు జరగొద్దు
- విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట
- పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు
- మంత్రి పొన్నం ప్రభాకర్
- వర్గల్ గురుకులంలో రాష్ట్ర స్పోర్ట్స్ మీట్ ముగింపు


విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ మనుచౌదరి

వర్గల్(గజ్వేల్): విద్యార్థుల ఆహారంలో నాణ్యత లోపిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం వర్గల్ పూలే బాలికల గురుకులంలో రాష్ట్ర స్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా కలెక్టర్ మను చౌదరి, గురుకుల అధికారులు, విద్యార్థులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి, కలెక్టర్‌తో కలిసి విద్యార్థుల మార్చ్ ఫాస్ట్ తిలకించి, గౌరవ వందనం స్వీకరించారు. ఆకట్టుకునేలా కొనసాగిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు తిలకించి, ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. రాష్ట్రంలో గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ కేసులు వెలుగు చూడడంతో అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకున్నామన్నారు. ఆహార పదార్థాలు నాణ్యంగా ఉండాలని, విద్యార్థులపై నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులైన వారిపై చర్యలకు ఉపేక్షించబోమని హెచ్చరించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా రూ.1,100 కోట్లతో 25,000 పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. ఉపాధ్యాయుల నియామకాలు చేశామని, 2010 నుంచి బదిలీలకు నోచని మోడల్ స్కూల్ ఉపాధ్యాయులను బదిలీ చేసి వారిలో అసహనం తొలగించామని స్పష్టం చేశారు. గురుకులాలకు అద్దెలు చెల్లించామని, సొంత భవనాల్లో గురుకులాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నాణ్యమైన ఆహారం కోసం డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచామని, డైటీషన్ సలహాతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల సెక్రటరీలతో చర్చించి మెనూ ఏర్పాటు చేస్తామన్నారు. భవిష్యత్‌లో గురుకులాల్లో గ్రీన్ ఛానెల్ ద్వారా మెస్ చార్జీలు అందజేస్తామని, రూ.5,000 కోట్లతో 30 ఎకరాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ తీసుకొస్తున్నట్లు వివరించారు. కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ.. ఆటలంటే తనకు ఎంతో ఇష్టమని, అన్ని ఆటలు ఆడేవాడినని, ఐఏఎస్ కాకుంటే క్రీడాకారుడిని అయ్యేవాడినని విద్యార్థులకు ఆటల ప్రాధాన్యత వివరించారు. కార్యక్రమంలో బీసీ పూలే గురుకులాల సెక్రటరీ బీ.సైదులు, జాయింట్ సెక్రెటరీ తిరుపతి, ఆర్సీఓ గౌతమ్ కుమార్‌రెడ్డి, ఏజీఓ లింగయ్య, ఆతిథ్య గురుకుల ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు

### ఓవరాల్ చాంపియన్ మహబూబ్‌నగర్

అండర్ 17, 19 కబడ్డీ పోటీల్లో మహబూబ్‌నగర్ ప్రథమ, మెదక్ ద్వితీయ స్థానం సాధించింది. అండర్ 14 కబడ్డీలో నల్గొండ ప్రథమ, వరంగల్ ద్వితీయ, అండర్ 14, 17 ఖోఖోలో మహబూబ్‌నగర్, నల్గొండ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. అండర్ 14 వాలీబాల్ పోటీలో మహబూబ్‌నగర్, నల్గొండ, అండర్ 17లో మహబూబ్‌నగర్, మెదక్ వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించాయి. అండర్ 19లో నిజామాబాద్ ప్రథమ, రంగారెడ్డి ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. టెన్నీకాయిట్ అండర్ 17లో మహబూబ్‌నగర్, మెదక్ ప్రథమ, ద్వితీయ స్థానాలు, అండర్ 14, 17, 19 చెస్ పోటీల్లో శ్రీమోక్ష (మెదక్), జాహ్నవి(మెదక్), వైష్ణవి(ఖమ్మం) విజేతలుగా నిలిచారు. అండర్ 14 విభాగం వ్యక్తిగత చాంపియన్‌షిప్‌ను జీ.నందిని (మహబూబ్‌నగర్), అండర్ 17లో శరణ్య(రంగారెడ్డి),అండర్ 19లో పూజ (మెదక్) దక్కించుకున్నారు.